క్లుప్తంగా

చురుగ్గా 'వై ఏపీ నీడ్స్ జగన్'



వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి, సంక్షేమ పాలనను వివరిస్తున్న వలంటీర్ గౌరీశ్వరి

తెర్లాం: మండల కేంద్రంలోని సచివాలయం-1, సచివాలయం-2 పరిధిలో గత కొన్నిరోజులుగా వై ఏపీ నీడ్స్ జగన్(ఆంధ్రప్రదేశ్‌కు జగన్ ఎందుకు కావాలంటే) కార్యక్రమం చాలా చురుగ్గా సాగుతోంది. గ్రామ వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు ఇంటింటికీ వెళ్లి, నాలుగున్నరేళ్లుగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తున్నారు. గతంలో టీడీపీ పాలనకు, వైఎస్సార్ సీపీ పాలనకు ఉన్న స్పష్టమైన తేడాను చెబుతున్నారు. రోజుకు 15 ఇళ్ల చొప్పున ఇంటింటికీ వెళ్లి, ప్రజలకు ప్రభుత్వం చేసిన మేలును తెలియజేస్తుండడం విశేషం.

అక్రమంగా ఇసుక తరలింపు



రాజాం మెయిన్‌రోడ్డు మీదుగా వెళ్తున్న ఇసుక ట్రాక్టరు

రాజాం: స్థానిక పట్టణం మీదుగా అక్రమంగా ఇసుక తరలిస్తున్నారు. పోలీసులు, ఎస్ఈబీ అధికారులకు దొరకకుండా సంతకవిటి, రేగిడి మండలాల్లోని నదీతీర ప్రాంతాల నుంచి రాజాం మీదుగా ట్రాక్టర్లలో ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. అధికారులకు పట్టుబడకుండా ఉండేందుకు మితిమీరిన వేగంతో వాహనాలు నడుపుతున్నారు. ఈ క్రమంలో ఒక్కోసారి ప్రమాదాలు కూడా జరుగుతున్నాయని పట్టణ వాసులు ఆరోపిస్తున్నారు. రేగిడి మండలం, లక్ష్మణవలస గ్రామం నుంచి ఇసుక ట్రాక్టర్లు ఎక్కువగా వస్తున్నట్లు చెబుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి, ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోవాలని కోరుతున్నారు.

నేడు కంచరాంలో గ్రంథాలయం ప్రారంభం

రాజాం సిటీ: మండలంలోని కంచరాం గ్రామంలో కొత్తగా నిర్మించిన ప్రజా గ్రంథాలయ భవనాన్ని ఎంపీపీ లావేటి సులోచన చేతులమీదుగా మంగళవారం ప్రారంభించనున్నామని గ్రంథాలయ అధ్యక్షుడు పాదిలాపు శ్రీనివాసరావు సోమవారం వెల్లడించారు. రూ.30 లక్షలతో గ్రామస్తుల సహాయ, సహకారాలతో ఈ భవనం నిర్మించామని, ఈ నెల 20వ తేదీ వరకు గ్రంథాలయ వారోత్సవాలు కూడా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

బాణసంచా విక్రేతలపై కేసు నమోదు

వంగర: అక్రమంగా బాణసంచా విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఆర్.జనార్దనరావు సోమవారం తెలిపారు. రుషింగి గ్రామానికి చెందిన తూముల సాయిధనుంజయరావు వద్ద నుంచి రూ.8,465 విలువైన బాణసంచా నిల్వలు, అరసాడ గ్రామానికి చెందిన అడ్డా భుజంగరావు వద్ద నుంచి రూ.8,850 విలువైన బాణసంచా స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

అలరించిన అఖండ నామ సంకీర్తన

రేగిడి: మండల కేంద్రంలోని విశ్వసాయి మందిరంలో ఆదివారం నిర్వహించిన అఖండ నామ సంకీర్తన అలరించింది. భగవాన్ శ్రీసత్యసాయి బాబా జయంతి సందర్భంగా చేపట్టిన ఈ కార్యక్రమం భజన మండలి కన్వీనర్ మామిడి శివప్రసాద్ ఆధ్వర్యంలో 24 గంటల పాటు నిర్విరామంగా కొనసాగింది. బాబాను స్తుతిస్తూ భక్తులు ఆలపించిన గీతాలు ఆద్యంతం ఆకట్టుకున్నాయి.

దాడి కేసు నమోదు

రాజాం సిటీ: మండలంలోని గురవాం గ్రామానికి చెందిన పైల శ్రీనివాసరావుపై అదే గ్రామానికి చెందిన కుప్పిలి అభిరామ్, రాగోలు నవ, కుప్పిలి ప్రదీప్‌లు దాడి చేయడంపై కేసు నమోదు చేశామని సీఐ కె.రవికుమార్ సోమవారం తెలిపారు. దీపావళి పండగ సందర్భంగా శ్రీనివాసరావు ఇంటికి వెళ్లి, దీపావళి సామగ్రిని వారు అడిగారు. తన వద్ద లేవని చెప్పడంతో శ్రీనివాసరావుపై సదరు వ్యక్తులు దాడికి పాల్పడి, గాయపరిచారు. వైద్యసేవల నిమిత్తం రాజాం ప్రభుత్వాస్పత్రిలో అతడిని కుటుంబ సభ్యులు చేర్పించారు. ఆస్పత్రి నుంచి వచ్చిన మెడికల్ రిపోర్టు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు

రాజాం సిటీ: మండల పరిధిలోని బొద్దాం గ్రామంలో పారిశుద్ధ్య పనులు ముమ్మరంగా సోమవారం చేపట్టారు. కాలువల్లో పేరుకుపోయిన పూడికలను జేసీబీ సహాయంతో తీయించారు. గ్రామస్తులకు ఇబ్బంది లేకుండా కాలువల్లో తీసిన పూడికలను ఆరుబయటకు ట్రాక్టర్ ద్వారా తరలించారు. ఈ పనులను డీఎల్‌పీవో మోహనరావు, ఈవోపీఆర్‌డీ శ్రీనివాసరావు పరిశీలించారు.

అంబరాన్నంటిన దీపావళి సంబరాలు



రేగిడి: దేవుదళ కేజీబీవీలో దీపావళి వేడుకల్లో విద్యార్థినులు

వాడవాడలా ఆదివారం జరిగిన దీపావళి సంబరాలు అంబరాన్నంటాయి. చెడుపై మంచి సాధించిన గెలుపునకు ప్రతీకగా ఏటా అశ్వయుజ అమావాస్య నాడు ఈ పండగ జరుపుకుంటుండడం ఆనవాయితీ. సాయంత్రం అందరూ స్నానాలు చేసి, కొత్తబట్టలు ధరించి, పూజలు చేశారు. అనంతరం చిన్నా పెద్దా తేడా లేకుండా దీపాలు వెలిగించి, క్రాకర్స్ కాల్చి, సంతోషంగా గడిపారు. ఈ వేడుకలతో ప్రతిఇంటా ఆనందాలు వెల్లివిరిశాయి.

– సాక్షి నెట్‌వర్క్



రాజాం: రాజాం పట్టణంలోని స్వగృహంలో కుటుంబ సభ్యులతో కలిసి దీపావళి వేడుకలు జరుపుకుంటున్న ఎమ్మెల్యే కంబాల జోగులు



రాజాం సిటీ: ఆనందంగా క్రాకర్స్ కాల్చుతున్న మహిళలు



రాజాం: పెనుబాకలో కుటుంబ సభ్యులతో కలిసి దీపావళి సంబరాలు చేసుకుంటున్న జెడ్పీటీసీ నర్సింహులు



సంతకవిటి: రంగారాయపురంలో దీపాల వెలుగులో దీపావళి ముగ్గు



రామభద్రపురం: రామభద్రపురంలో ఆనందంగా క్రాకర్స్ కాల్చుతున్న చిన్నారులు



బాడంగి: ముగడ కాలనీలో ఓ ఇంటి వద్ద దీపావళి సందడి



బొబ్బిలి: దీపావళి వేడుకల్లో సంప్రదాయంగా జనుము కట్టెలు కాల్చుతున్న దృశ్యం



మెంటాడ: మండల కేంద్రంలోని ఓ వీధిలో ఇంటిల్లపాది దీపావళి సంబరాలు జరుపుకుంటున్న దృశ్యం



రాజాం: బొద్దాంలో జరిగిన వేడుకల్లో వైస్ ఎంపీపీ వర్షిణి



వంగర: రుషింగిలో వేడుకల్లో సర్పంచ్ భాగ్యలక్ష్మి దంపతులు

నేటినుంచి గ్రంథాలయ వారోత్సవాలు



రాజాం: వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న దృశ్యం

రాజాం: స్థానిక శాఖా గ్రంథాలయంలో 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు మంగళవారం నుంచి నిర్వహిస్తున్నట్లు లైబ్రేరియన్ వై.అమర్‌నాథ్ తెలిపారు. ఈ వారోత్సవాలకు సంబంధించి, రూపొందించిన వాల్‌పోస్టర్లను గ్రంథాలయంలో సోమవారం ఆవిష్కరించారు. ఈ నెల 20వ తేదీ వరకు జరిగే ఈ వారోత్సవాల్లో విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్, ముగ్గుల పోటీలతో పాటు, వివిధ ఆటల పోటీలు కూడా నిర్వహించనున్నామన్నారు. కార్యక్రమంలో రాజాం రెడ్‌క్రాస్ చైర్మన్ కొత్తా సాయిప్రశాంత్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

బాడంగి: స్థానిక శాఖా గ్రంథాలయలో మంగళవారం నుంచి ఈ నెల 20వ తేదీ వరకు 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు లైబ్రేరియన్ ఆర్.దుర్గాప్రసాద్ కోరారు. 14వ తేదీన ప్రారంభోత్సవ కార్యక్రమం, 15న పుస్తక ప్రదర్శన, 16న గ్రంథాలయ ఉద్యమకారుల సంస్మరణ సభ, 17న కవి సమ్మేళనం, 18న విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖనం, ఆటల పోటీలు, 19న దిశ చట్టంపై మహిళలకు అవగాహన, 20న ముగింపు సమావేశం, బహుమతుల ప్రదానం ఉంటాయని పేర్కొన్నారు.

తెర్లాం: స్థానిక శాఖా గ్రంథాలయలో మంగళవారం నుంచి ఈ నెల 20వ తేదీ వరకు 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నామని లైబ్రేరియన్ కృష్ణమూర్తి తెలిపారు. ఈ నెల 14వ తేదీ నుంచి 20వ తేదీ వరకు జరిగే ఈ కార్యక్రమంలో భాగంగా రోజువారీ జరిగే కార్యక్రమాల వివరాలు తెలిపే కరపత్రాలు, వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. గ్రంథాలయ వారోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

సక్రమంగా రికార్డుల నిర్వహణ

రాజాం: గ్రామ సచివాలయాల రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని డీపీవో(డిస్ట్రిక్ట్ పంచాయతీ ఆఫీసర్) డి.నిర్మలాదేవి డీడీవోలకు సూచించారు. సోమవారం మండలంలోని బొద్దాం గ్రామంలో ఉన్న సచివాలయ నూతన భవనాన్ని పరిశీలించిన ఆమెకు ఈ నెల 16వ తేదీన ఈ భవనం ప్రారంభించడం జరుగుతుందని గ్రామస్తులు తెలిపారు. అనంతరం సచివాలయంలో రికార్డులను ఆమె పరిశీలిస్తూ జల్‌జీవన్ మిషన్ పనులపై ఆరాతీశారు. ప్రభుత్వ అభివృద్ధి పనులను త్వరితగతం చేయాలని, అర్హులకు పథకాలు, ప్రభుత్వ సేవలు అందేలా చూడాలని తెలిపారు. గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు ముమ్మరం చేసి, గ్రామాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు.



అధికారులకు సూచనలిస్తున్న డీపీవో నిర్మలాదేవి

కార్యక్రమంలో సర్పంచ్ నక్క తవిటమ్మ, వైస్ ఎంపీపీ నక్క వర్షిణి, ఎంపీడీవో బాసూరి శంకరరావు, ఈవోపీఆర్‌డీ వావిలపల్లి శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి దిలీప్‌కుమార్, వీఆర్‌వో రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

పంటకోత ప్రయోగం

రేగిడి: మండలంలోని గుళ్లపాడు గ్రామంలో రైతు గుడ్ల హేమలతకు చెందిన వరిపంట పొలంలో పంటకోత ప్రయోగం సోమవారం చేపట్టారు. ఎకరం పొలానికి 30 బస్తాలకు పైగా దిగుబడి వచ్చినట్లు ఏవో జి.మురళీకృష్ణ, మండల ఉప గణాంక అధికారి ఏసుబాబులు తెలిపారు. మండలంలో 101 మంది రైతులకు చెందిన పొలాల్లో 144 పంటకోత ప్రయోగాలు చేశామన్నారు. దిగుబడులు ఆశాజనకంగా ఉండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో అగ్రికల్చర్ అసిస్టెంట్ ఎస్.మహేష్, వీఆర్ఏ నీలయ్య తదితరులు పాల్గొన్నారు.



గుళ్లపాడులో వరిపొలంలో పంటకోత ప్రయోగం చేస్తున్న వ్యవసాయ సిబ్బంది

వైఎస్సార్ బీమా తక్షణసాయం అందజేత



బాధితురాలికి రూ.10 వేలను అందజేస్తున్న ఎంపీపీ లక్ష్మణరావు, జెడ్పీటీసీ సరస్వతి

రామభద్రపురం: మండల కేంద్రానికి చెందిన మామిడి చిన్నారావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఈ మేరకు ఆయన భార్య మామిడి పైడితల్లికి వైఎస్సార్ బీమా తక్షణసాయం కింద రూ.10 వేలను ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు, జెడ్పీటీసీ అప్పికొండ సరస్వతి చేతులమీదుగా సోమవారం అందజేశారు. మిగతా రూ.4.9 లక్షలను త్వరలో అందించనున్నారు. బొబ్బిలి రైలు దుర్ఘటనలో గొర్లె చిన్నారావు, పాముకాటుతో చీపురు సాంబ మరణించగా, బాధిత కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున వైఎస్సార్ బీమా మంజూరు కాగా, వాటి ధ్రువపత్రాలను బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు అప్పికొండ లక్ష్మోంనాయుడు, మండల సచివాలయ కన్వీనర్ చింతల సింహాచలంనాయుడు, ఎంపీడీవో రమామణి తదితరులు పాల్గొన్నారు.

కోడూరు-2, బాడంగి-2 సచివాలయాల ప్రారంభోత్సవం రేపు

బాడంగి: మండలంలోని కోడూరు-2, బాడంగి-2(పిన్నవలస) గ్రామ సచివాలయాలను బుధవారం ప్రారంభించనున్నట్లు మండల జేసీఎస్ కన్వీనర్ మరిపి శంకరరావు, జెడ్పీటీసీ పెద్దింటి రామారావు ఓ ప్రకటనలో సోమవారం వెల్లడించారు. ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు చేతులమీదుగా ఈ ప్రారంభోత్సవం జరుగుతుందని, మండల స్థాయి ప్రజాప్రతినిధులు, కార్యకర్తలంతా హాజరు కావాలని కోరారు. అదేరోజు కోడూరు-2 సచివాలయ పరిధిలోని రామచంద్రాపురంలో వై ఏపీ నీడ్స్ జగన్(ఆంధ్రప్రదేశ్‌కు జగన్ ఎందుకు కావాలంటే) కార్యక్రమం కూడా ఉంటుందని తెలిపారు.

బొబ్బిలి: మండలంలోని ఎం.బూర్జివలస, కాశిందొరవలస గ్రామాల్లో కొత్తగా నిర్మించిన వెల్‌నెస్ సెంటర్ భవనాలను ఈ నెల 15వ తేదీన ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు చేతులమీదుగా ప్రారంభించనున్నట్లు పంచాయతీరాజ్ డీఈఈ సీహెచ్‌వీ అప్పారావు తెలిపారు. ఉదయం 9.30 గంటలకు ఎం.బూర్జివలసలో, 10 గంటలకు కాశిందొరవలస గ్రామంలో ఈ ప్రారంభోత్సవం ఉంటుందన్నారు.

నైట్‌హాల్ట్ బస్సును పునరుద్ధరించండి

వంగర: విశాఖపట్నం నుంచి మండలంలోని బంగారువలసకు ఆర్టీసీ నైట్‌హాల్ట్ బస్సు సర్వీసును పునరుద్ధరించాలని వంగర, రేగిడి మండలాల ప్రజలు కోరుతున్నారు. ఏళ్ల తరబడి నడుపుతున్న ఈ బస్సును నెలరోజుల క్రితం నిలిపివేయగా, ఆ బస్సు సేవలపై ఆధారపడి ప్రయాణిస్తున్న చాలా మంది ఇబ్బందులు పడుతున్నారు. ప్రతిరోజూ ఉదయం 5 గంటలకు బంగారువలస నుంచి విశాఖపట్నానికి బస్సు సర్వీసు ఉండడంతో వివిధ పనులకు వెళ్లే ఆయా మండలాల్లోని 30 గ్రామాల ప్రజలకు ఎంతో సౌకర్యంగా ఉండేది. ఇదే విషయం ప్రజాప్రతినిధులు, ఆర్టీసీ అధికారుల దృష్టికి తీసుకువెళ్లామని, తక్షణమే స్పందించి, బస్సు పునరుద్ధరణ జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు.

సామాజిక సాధికార బస్సుయాత్రను విజయవంతం చేయాలి

- ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్



రాజాం: సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ విక్రాంత్ పక్కనే ఎమ్మెల్యే కంబాల జోగులు



రాజాం సిటీ: సభాస్థలం పరిశీలనలో ఎమ్మెల్సీ, విప్ లేళ్ల అప్పిరెడ్డి, ఎమ్మెల్యే జోగులు, ఎమ్మెల్సీ విక్రాంత్

రాజాం: స్థానిక పట్టణంలో ఈ నెల 16వ తేదీన జరిగే వైఎస్సార్ సీపీ సామాజిక సాధికార బస్సు యాత్రను జయప్రదం చేయాలని ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ కోరారు. ఇదే విషయమై స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో రాజాం మండల పార్టీ నేతలతో సోమవారం సమావేశమైన వారు కార్యక్రమ విజయవంతానికి చేపట్టాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. బస్సుయాత్ర ద్వారా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఈ నాలుగున్నరేళ్లలో చేసిన అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతీ ఇంటికి తెలియజేయాలని సూచించారు. పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులంతా యాత్రలో పాల్గొనాలన్నారు. సమావేశంలో పార్టీ ఎస్సీ సెల్ జోన్-1 జోనల్ ఇన్‌చార్జ్ కంబాల సందీప్, రాజాం రూరల్ కన్వీనర్ లావేటి రాజగోపాలనాయుడు, జెడ్పీటీసీ బండి నర్సింహులు, రాజాం పీఏసీఎస్ అధ్యక్షుడు వాకముల్ల చిన్నంనాయుడు, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు కోనారి అప్పారావు, వైస్ ఎంపీపీలు యాలాల వెంకటేష్, నక్క వర్షిణిలు, జేసీఎస్ కన్వీనర్ కామోదుల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఉదయం 10 గంటలకు..

రేగిడి: ఈ నెల 16న సామాజిక సాధికార బస్సు యాత్ర నేపథ్యంలో మండలంలోని ఉంగరాడమెట్ట వద్ద ఉన్న వైఎస్సార్ కల్యాణ మండపంలో పార్టీ నేతలు, కార్యకర్తలతో ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ సోమవారం సమావేశమై, యాత్ర విజయవంతానికి చేపట్టాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. ఉదయం 10 గంటలకు మీడియా సమావేశం, గ్రామ సచివాలయాల సందర్శన, అనంతరం బస్సుయాత్ర, బహిరంగ సభ జరుగుతాయని వివరించారు. ప్రతీ పంచాయతీ నుంచి సామాజికవర్గానికి చెందిన నేతలు, కార్యకర్తలు, ప్రజలుండాలని, మండలం నుంచి 10 వేలకు పైగా సామాజిక వర్గ ప్రజలు యాత్రకు వచ్చే అవకాశం ఉందని, వారందరికీ రవాణా ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ దార అప్పలనరసమ్మ, వైస్ ఎంపీపీలు టంకాల అచ్చెన్నాయుడు, వావిలపల్లి జగన్మోహనరావు, జేసీఎస్ కన్వీనర్ పాలవలస రామచంద్రినాయుడు తదితరులు పాల్గొన్నారు.

సభాస్థలి పరిశీలన..

రాజాం సిటీ: స్థానిక పట్టణంలో ఈ నెల 16వ తేదీన జరగనున్న సామాజిక సాధికార బస్సు యాత్రకు సంబంధించిన, సభాస్థలాన్ని ఎమ్మెల్సీ, విప్ లేళ్ల అప్పిరెడ్డి పరిశీలించారు. స్థానిక పాలకొండ రోడ్డులోని జేజే ఇన్నోటెల్ ఎదురుగా ఉన్న స్థలాన్ని సోమవారం పరిశీలించి, సభ ఏర్పాట్లపై ఆరాతీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బస్సుయాత్రకు పెద్దఎత్తున పార్టీ శ్రేణులు హాజరయ్యే అవకాశం ఉందని, వారికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా, అలాగే ఏ రకమైన అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా చూడాలని కోరారు. ఆయన వెంట ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ, విప్ పాలవలస విక్రాంత్, నియోజకవర్గ పరిశీలకులు పేరాడ తిలక్, ఎమ్మెల్సీ పెనుమత్స సూర్యనారాయణరాజు(సురేష్‌బాబు), నవరత్నాల ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ అంకంరెడ్డి నారాయణమూర్తి తదితరులు ఉన్నారు.

22న బొబ్బిలిలో..

బొబ్బిలి: స్థానిక పట్టణంలో ఈ నెల 22వ తేదీన జరిగే సామాజిక సాధికార బస్సుయాత్ర నేపథ్యంలో ఈ నెల 15వ తేదీన స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో సన్నాహక సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం అధికారులు ఓ ప్రకటనలో సోమవారం వెల్లడించారు. ఉదయం 10.30 గంటలకు ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి నియోజకవర్గంలోని పార్టీ నేతలంతా హాజరుకావాలని కోరారు.



రామభద్రపురం: కార్తీకమాస పూజలకు ముస్తాబైన నరసాపురం శివాలయం



రాజాం: రాజాం పట్టణంలోని మల్లిఖార్జునస్వామి ఆలయం



రాజాం: విద్యుత్ అలంకరణలో కొండంపేట అయ్యప్పస్వామి ఆలయం



రాజాం సిటీ: కార్తీక స్నానాలకు చెరువు వద్ద ఏర్పాట్లు చేస్తున్న యువకులు



బాడంగి: పాల్తేరులో విద్యుత్ వెలుగుల్లో మల్లిఖార్జునస్వామి ఆలయం



రేగిడి: రంగులద్దుకున్న సంకిలి శివాలయం

కార్తీకం.. శుభకరం..

- నేటినుంచి కార్తీకమాస పూజలు
- నాలుగు వారాల పాటు నిర్వహణ
- ముస్తాబైన ఆలయాలు

అన్ని మాసాల్లో కన్నా కార్తీకమాసం పవిత్రమైనది. ఈ మాసంలో వచ్చే నెలరోజులను అత్యంత పవిత్రమైన రోజులుగా హిందువులు భావిస్తారు. మహిళలు ప్రత్యేక నోములు, వ్రతాలు ఆచరిస్తారు. శివుడికి, విష్ణువుకి అత్యంత ప్రీతికరమైన ఈ మాసంలో ప్రతీ సోమవారం శివుడికి, ప్రతీ శుక్ర, శనివారాల్లో విష్ణుమూర్తికి పూజలు చేస్తారు. కార్తీక సోమవారాల్లో చేసే దీపారాధన, ఉసిరిచెట్టు కింద పూజలు, వనభోజనాలు ఆరోగ్యానికి ఎంతోమేలు చేస్తాయని పండితులు చెబుతున్నారు. ఈ నెల 14వ తేదీ నుంచి ప్రారంభం కానున్న ఈ పూజలు నాలుగు వారాల పాటు కొనసాగనున్నాయి. ఈ నేపథ్యంలో అన్ని ఆలయాలు సరికొత్తగా ముస్తాబు కావడం విశేషం.

– బొబ్బిలి, రాజాం సాక్షి నెట్‌వర్క్

నేడు మండల సర్వసభ్య సమావేశం

వంగర: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం మంగళవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శశిభూషణరావు ఓ ప్రకటనలో సోమవారం వెల్లడించారు. ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ అధ్యక్షతన జరగనున్న ఈ సమావేశానికి ప్రజాప్రతినిధులంతా హాజరవుతారని, మండల స్థాయి అధికారులు హాజరుకావాలని కోరారు.